





"ఉద్యోగం ఎలా సంపాదించాలీ ? అన్న ప్రశ్న అప్పటికీ ఇప్పటికీ—ఎప్పటికీ కూడా, జీవితంలో అడుగుపెట్టబోయే యువకుల్ని పెనుభూతంలా ఎదుర్కొంటుంది" అన్నాడు ప్లీడరు కైలాసరావు.

"అయితే యువతుల మాటో ?" అని అడ్డు ప్రశ్న వేశాడు కైలాసరావు మేనల్లుడు శ్యామలరావు.

"ఆ సందేహం నీకు వస్తుందని నాకు ముందే తెలుసు. అసలు నీ మనస్సులో వారికే ప్రాముఖ్యత. కానీ, కాస్సేపు వాళ్ల మాటాన వాళ్లని వదిలెయ్యి. ఆడవాళ్ల సంగతి నీకు తెలియదు. పైకి మగవాళ్లతో 'సమానహక్కులు కావాలీ' అని అన్నా, మగవాళ్ల కన్నా వాళ్లకే హక్కులు ఎక్కువ ఉన్నాయనీ, ఎక్కడికి ఏ పనిమీద వెళ్లినా ముందు వారికే ప్రత్యేక గౌరవం లభిస్తుందనీ వాళ్లకి తెలుసు. కాబట్టి ఆ ప్రశ్న వాళ్లని, అంతగా బాధించదు. అసలు ఆమాటకొస్తే, నువ్వు నా మేనల్లుడివి కాక — మేనకోడలువి అయిఉంటే ఈపాటికి అరడజను ఉద్యోగాలు వేయించేసి ఉందును."

"సారీ మామయ్యా ! ఇన్నాళ్లా నే ననుకున్నది ఒక్కటీ జరగకపోవడానికీ కారణ మేమిటా ? అని తెలుసుకోలేక బాధపడ్తూ ఉండేవాడిని. ఇప్పుడు తెలిసింది. అసలు నా పుట్టుకలోనే లోపం ఉందన్నమాట !" అన్నాడు, శ్యామలరావు తను మగాడిగా పుట్టినందుకు ఎంతో పశ్చాత్తాప పడుతూ.

"అదొక్కటే కాదురా, అసలు ఉద్యోగం సంపాదించాలంటే, తెర వెనుక ప్రయత్నాలు చాలా ఉండాలి."

"అంటే ?" అని మళ్లీ ఇంకో ప్రశ్న వేశాడు శ్యామలరావు.

కైలాసరావు సిగరెట్టు వెలిగించి రెండు దమ్ములు లాగాడు. శ్యామలరావు వైపు ఒకసారి చూసి చిన్న చిరునవ్వు నవ్వి "అంటే — సినిమాలో బొమ్మ పడాలంటే, ఆ బొమ్మకి, తెర మీద కన్పించే ముందు ఎంత మేకప్, ఎంత డైరక్షన్, ఎన్ని రిహార్సల్సూ కావాలో అలాగే ఉద్యోగ రంగంపై ప్రవేశించేముందు, అనేక రకాల ప్రయత్నాలు చేసి, మనం తప్పకుండా ఇంటర్వ్యూలో సెలక్టు అవుతామూ అని తెలిశాకే ఇంటర్వ్యూకి వెళ్లాలి."

"ఆ ప్రయత్నా లేమిటో చెప్పు మామయ్యా, నేనూ చేస్తాను" అన్నాడు శ్యామలరావు, చాలా ఆత్రుతతో.

కైలాసరావు ఒక్కనిముషం మాట్లాడకుండా, శ్యామలరావు వైపు తీక్షణంగా చూసి, "నీకు తెలివి అనేది కొంచెం కూడా లేదురా. ప్రయత్నా లనేవి, ఫలానా పద్ధతిలో చెయ్యాలీ— అని ఎక్కడైనా ఉంటుందా ? ఆయా పరిస్థితుల్ని బట్టి, మనం ఎటువంటి ప్రయత్నాలు చెయ్యాలో ఆలోచించి చెయ్యాలి" అన్నాడు.

"నిజమే మామయ్యా. పోనీ ఏదైనా ఒక ఉదాహరణ చెప్పు. అది నా దృష్టిలో ఉంచుకొని, అటువంటి ప్రయత్న మేదైనా చెయ్యడానికి ప్రయత్నిస్తాను."

కైలాసరావు ఒక గట్టి దమ్ము లాగి, సిగరెట్టు నగం కాలి పోయేట్టు చేశాడు. సాధారణంగా, పెద్ద కేసులో ఏదైనా చక్కని లాపాయింటు కోసం ఆలోచించినప్పుడు—అంత గట్టి దమ్ము లాగడం అతని కలవాటు. దమ్ము లాగగానే "మధ్యవర్తి !" అన్నాడు కొంచెం పెద్ద గొంతుకతో. శ్యామలరావు తెల్లబోయాడు. కైలాసరావు మళ్లీ "మధ్యవర్తిరా, మధ్యవర్తి ! అంటే ఆ ఉద్యోగం ఎవడిస్తాడో, వాడిని ఒక మధ్యవర్తి ద్వారా పట్టుకోవాలి. దానికోసం, ముందర ఆ మధ్యవర్తిని పట్టుకోవాలి."

"ఎలా పట్టుకోవడం ?" అన్నాడు శ్యామలరావు ఆలోచిస్తూ, తనలో తను ప్రశ్న వేసుకుంటున్నట్లు.

"నాస్పెన్సు ! డబ్బురా, డబ్బు ! అది పారేసి మధ్యవర్తి ద్వారా వ్యవహారం నడిపించాలి" అని కైలాసరావు అన్నాక అసలు విషయం బోధపడింది, శ్యామలరావుకి.

"అయితే మధ్యవర్తి ద్వారా లంచమిచ్చి ఉద్యోగం సంపాదించా లంటావు" అన్నాడు శ్యామలరావు, "ఇంతేనా !" అన్నట్లు.

"అదే నబ్బాయి. అది ఎంత విలువైన సలహాయో, ఆచరించాక గాని తెలియదు" అన్నాడు, ఫీజేమీ లేకుండానే సలహా నిచ్చేస్తున్నానే—అని విచారిస్తూ, కైలాసరావు.

శ్యామలరావు కొంచెం ఆలోచించాడు. కైలాసరావు, చనువు కొద్దీ మేనల్లుడ్ని, తెలివితక్కువవాడిగా జమ కట్టేసి మాట్లాడినా, శ్యామలరావు మరీ అంత బొత్తిగా తెలివిలేనివాడు కాదు. ఇరవై రెండేళ్ల గ్రాడ్యుయేట్ అయిన అయిన శ్యామలరావు, సుమారు రెండు సంవత్సరాలనుంచీ, విశాఖపట్నం మహానగరంలో ఉద్యోగాన్వేషణకై నానా తిప్పలూ పడి కొంత ప్రపంచజ్ఞానం సంపాదించాడు. ప్రస్తుతంలో, మద్రాసులో జరుగబోతున్న ఒక ఇంటర్వ్యూకి వెళ్తూ, రాజమండ్రిలో నున్న మేనమామ కైలాసరావు ఇంట ఒక్క ఒకరోజు గడుపుటకు, రాజమండ్రిలో దిగాడు. తను ఉద్యోగం గురించి ఎన్ని విధాలుగా అవస్థ పడుతున్నదీ, మేనమామకు చెప్పాడు.

ఉద్యోగం అనేది ఎలా సంపాదించాలో, దానికి కావలసిన లక్షణాలేమిటో, కొంతవరకు అల్లుడికి బోధపరుద్దామనే ఉద్దేశంతో ఈ సంభాషణ ప్రారంభించాడు. ఎనభై ఏళ్ళ పైబడ్డ ప్లీడరు కైలాసరావు. అతని ఉద్దేశంలో మనం సాధించవలసిన పని మంచిదైనప్పుడు, దానిని సాధించడం కోసం ఎటువంటి మార్గ మవలంభించినా తప్పు లేదు. అది వ్యవహార ధర్మమంటాడు. తను పట్టిన కేసును గెల్పించటానికి ఎటువంటి అబద్ధాలాడడానికైనా వెనుదియ్యడు. ఉద్యోగం సంపాదించటానికి, కేవలం ప్రతిభే ప్రధానం కాదనీ, కొన్ని తతంగాలు జరిపితే కాని ఉద్యోగం లభించదనీ, అతని వాదం. శ్యామలరావు, కైలాసరావు చెప్పిన మాటలన్నీ విన్నాడు.

"నే నొక సంగతి చెప్పనా, మామయ్యా !" అని శ్యామలరావు అడిగాడు. కైలాసరావు చెప్పమన్నాడు.

"మా వూళ్లో, నేను ఏడాది క్రిందట ఒక ఉద్యోగానికి ప్రయత్నం చేశాను. అది కాస్త మంచి ఉద్యోగమే. దానికి కావలసిన మనిషిని నియమించే అధికారి కూడా ఆ వూళ్లోనే ఉన్నాడు, అదే అతని హెడ్‌క్వార్టర్సవటం మూలాన. ఆ అధికారి, పట్టి లంచగొండి అని పుకారు."

"నే నా ఉద్యోగానికి దరఖాస్తు పడేశాను. నాతో పాటు సుమారు పాతికమందికి ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఆ ఉద్యోగాన్నెలాగైనా సంపాదించాలని నాకు అభిప్రాయం కలిగింది. మా అమ్మకి నచ్చజెప్పి, నాలు గొందల రూపాయలు, లంచమివ్వటానికి సిద్ధం చేశాను. అయితే, లంచ మివ్వటమెలా ? — అన్నదే సమస్య. అప్పటికి ఇంటర్వ్యూ ఇంకా వారం రోజులు వ్యవధిలో ఉంది. ఆ ఆఫీసరుతో సన్నిహితంగా తిరిగేవాళ్లెవరా ? అని వాకబు చేశాను. మా ఊళ్లో సీతాపతి గారని ఒక ప్లీడరుగా రున్నారు. ఆయనకూ, ఆ ఆఫీసరుకీ చాలా స్నేహం అని విన్నాను. నేను రెండు, మూడు సార్లు ఆఫీసరు గారితో సీతాపతిగారు, కారులో తిరగడం కూడా చూశాను. అందువల్ల సీతాపతి గార్ని పట్టుకుంటే తప్పకుండా పని అవుతుందనే నమ్మకం నాకు కలిగింది."

"ఒకనాడు ప్రొద్దున్న, పని గట్టుకుని సీతాపతిగా రింటికి వెళ్లాను. ఆయన నన్ను చూచి 'ఏం' పనిమీద వచ్చా ?' వని అడిగారు. నేను ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాననీ, నాకు ఆ వూళ్లో ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూకి రమ్మని వచ్చిందనీ, కానీ సుమారు పాతికమంది ఆ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారనీ విన్నాననీ, ఉన్న దొక్కటే ఖాళీ అవటంవల్ల నాకు వస్తుందో, రాదో అని బెంగగా ఉందనీ చెప్పాను. ఈ విషయంలో ఆయన సహకారం కావాలని, అర్థించాను. ఆయనకీ ఆఫీసరుకీ స్నేహం బట్టి ఆయన తల్చుకుంటే అయి

—66 వ పేజీ చూడండి

'ఆంధ్రసచిత్రవారపత్రిక'లో
*ప్రకటనలు మీవ్యాపారాభివృద్ధికి
తోడ్పడుతాయి.*

# తరచుగా మూత్రవిసర్జన

చక్కెరతో గాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైన చిహ్నము. శరీరాన్ని గుల్ల చేయడమే కాకుండా ఈవ్యాధి, తనబంధలో చిక్కినవారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసిక శ్రమలకు యిచ్ఛగించకుండుట, నడుములో నొప్పి, చూపుమాంద్యము, కండ్లలో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతో కూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో, అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు, కాళ్ళలో పగుళ్లు, తూకం తగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ళ నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, ఇట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్ ఛారమ్" మాత్రలు వాడి అనేక వేలమంది తమబాధలనుండినివారణపొంది మృత్యుకరాళముననుండి రక్షింపబడిరి. "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద ప్రాచీన యూనాని వైద్యవిధానం ప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్థముల,స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. "అమిత దాహము, మూత్రంలో చక్కెర తగ్గి పలుమారు మూత్రవిసర్జనచేయుఅవసరము 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణయగును. కొద్ది రోజులలోనే మీకు పగానికిపైగా స్వస్థత చేకూరిన ట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు. నిరాహారముతో నుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై ఇదివరకటికంటే ఎక్కువ వరకాల ఆహారపదార్థములు తీసికొనవచ్చును. వివరములుగల ఇంగ్లీషుకరపత్రములు అడిగినవారికిఉచితముగా పంపబడును.
**50** బిళ్ళలఖరీదు రు.**6-75**న.పై. మాత్రమే. పోస్టేజినిమిత్తం రు. **1-6** న. పై. అదనం. (ఒకేసారి రెండు, అంతకుపైగా సీసాలను తీసికొన్నచో పోస్టేజి ఉచితం.)

(SELLING AGENTS)
**Barrys Commercial Corporation**
(A. P. W)
**27/A, Dhurumtollah Street**
**CALCUTTA-13.**

# తెర వెనుక

9-వ పేజీ తరువాయి

తీరుతుందనే నమ్మకం నాకు ఉందని చెప్పాను. సీతాపతిగారు నే నన్నమాట లన్నీ ఓపికగా విన్నారు. చివరికి, కొంచెంసేపు ఆలోచించిన తరువాత, ఆ ఆఫీసరు తను చెప్పిన మాట వింటాడు గాని, లంచం యివ్వందే లాభం ఉండదని చెప్పారు. ఆ సంగతి అంతకుముందే నాకు తెలుసు కాబట్టి, లంచం యివ్వడానికి తయారుగా ఉన్నానని చెప్పాను. ఆయన మరునాడు డబ్బు తీసుకుని రమ్మని చెప్పాడు. ఆయన చెప్పిన విధంగా నేను, డబ్బు పట్టుకొని సీతాపతిగా రింటికి వెళ్ళాను. ఆయనా నేనూ ఆఫీసరుగా రింటికి కలిసే వెళ్ళాము. ఆఫీసరు గారితో సీతాపతిగారు చాలాసేపు రహస్యంగా మాట్లాడారు. నేను దూరంగా వీధిలో నుల్చొన్నాను. మధ్యలో సీతాపతిగారు నా వద్దకు వచ్చి నా పేరూ మొదలైన వివరాలు కనుక్కొని నా దగ్గర డబ్బున్న కవరు తీసుకొని ఆఫీసరుగారి వద్దకు వెళ్ళారు. ఆఫీసరుగారు ఇంట్లోకి వెళ్ళిపోయారు. ఆయన వెనకాలే సీతాపతిగారు కూడా లోపలికి వెళ్ళడం, వీధిలో నుల్చున్న నేను చూస్తూనే ఉన్నాను. పది నిముషాలు పోయాక సీతాపతిగారు తిరిగి నా వద్దకు వచ్చారు. 'పద వోయ్ వెళ్దాం. మన పని పూర్తయింది' అన్నారు నాకు తప్పక ఆ ఉద్యోగం వస్తుందని చెప్పారు."

"రెండు రోజుల తర్వాత ఇంటర్వ్యూ కూడా జరిగిపోయింది. నేను ఆ ఉద్యోగం నాకు వస్తుందని చాలా ధీమాతో ఉన్నాను. నెలరోజులు గడవగానే, ఆ ఉద్యోగానికి నేను సెలక్టు కాలేదనీ, మరొక రెవరో సెలక్టయ్యారని తెలిసింది. సీతాపతిగార్ని కలుసుకుని అడిగాను. ఆయన ఆ ఆఫీసరు కొన్ని కారణాంతరాలవల్ల అలా ప్రవర్తించాడనీ, కొద్ది రోజులలో అటువంటి ఖాళీ మరొకటి ఏర్పడుతుందనీ దానికి తప్పక నన్ను సెలక్టు చేస్తారని చెప్పాడు. తరువాత తెలిసిన విషయ మేమిటంటే, ఆ ఉద్యోగానికి సెలక్టయిన వ్యక్తి సీతాపతిగారి చుట్టమే నట. నా డబ్బుతో తన పని జరిగేట్టు చూసుకున్నాడేమో—ఆయన ! అని నాకు అనుమానం. మొత్తంమీద, మధ్యవర్తిన్ని నమ్మకోడంవల్ల డబ్బూ పోయింది, ఉద్యోగమూ రాలేదు" అన్నాడు శ్యామలరావు.

మేనల్లుడి విఫలమనోరథ గాథ విని కైలాసరావు "నువ్వు చేసిన పొరపాటల్లా సరియైన మధ్యవర్తిని ఎన్నుకోలేక పోవడమే. దానికి చాలా తెలివితేటలు అవసరం. ఆమాట కొస్తే, మగ మధ్యవర్తులకన్నా ఆడ మధ్యవర్తులు నయం." అన్నాడు.

"అంటే ?" అని అర్థంకానట్టడిగాడు శ్యామలరావు.

"పెద్ద పెద్ద ఆఫీసర్లు వాళ్ళ భార్యల నెంతో గౌరవంగా చూస్తుంటారు. మనం వీలు చూసుకొని ఆ — ఆఫీసరుగారి భార్యకు బత్తాయిలూ, ఆపిల్సూ, పువ్వులూ, పాలకోవా, ఐస్‌క్రీమ్ మొదలైనవి అడపా తడపా యివ్వడం, సమయాలనుకూలంగా మన పని జరిగితే మంచి కుట్టు మిషనో, ట్రాన్సిస్టరు రేడియోనో, లేకపోతే (నగలు) రిస్టువాచియో బహుమాన మిస్తామనీ ఆశ పెట్టడం ద్వారా ఆమె అభిమానం సంపాదించి ఆమెచేత సదరు భర్తకు గట్టి రికమెండేషన్ చేయిస్తే ...."

"లాభంలేదు మామయ్యా, ఆ అయిడియా కూడా ఫెయిల్ ప్రూపు కాదు. కొండొకచో బహు ప్రమాదకరం."

"ఎందుచేత ?" అని కోపంగా బల్లగుద్దాడు కైలాసరావు.

"చెప్తా విను" అని మొదలెట్టాడు శ్యామలరావు. మా ఊళ్లో ఒక పెద్ద కంపెనీలో ఒక మంచి ఉద్యోగం ఖాళీ వచ్చింది. ఆ ఉద్యోగానికి మనిషిని నియమించే ఆఫీసరుకి పెద్ద బంగళా మంచి కారుతో సహా ఒక చక్కని అందమైన భార్య కూడా ఉంది. ఆమె వయసులో చిన్నదీ, చాలా సరదా అయినదీ. ఆమెద్వారా ప్రయత్నం చేస్తే తప్పక ఆ ఉద్యోగం లభిస్తుందని నాకు తోచింది. వాళ్లింట్లో ఉన్న నౌకర్నొకణ్ణి పట్టుకొని ఆమెకు గులాబీ పువ్వులూ, జీడిపప్పూ, చాలా యిష్టమనీ తెలుసుకున్నాను. వెంటనే పలాసనుంచి రెండు టిన్నుల నిండా జీడిపప్పు తెప్పించాను. ఒక బుట్టెడు గులాబీపూలు కొన్నాను.. మరొక బుట్ట నిండా రకరకాల పళ్ళు కొన్నాను. ఖరీదైన బిస్కట్ల టిన్ను కూడా పట్టుకున్నాను. అయ్యగారు లేని సమయం చూసి, ఆమెకీ ప్రెజంట్లన్నీ సమర్పించాను. ఆవిడ అది చూసి చాలా సంతోషించింది. నా ఉద్యోగ విషయం ఆవిడతో చెప్పాను. నాగురించి తన భర్తతో తప్పక 'రికమెండు' చేస్తానంది. అసలా ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్న వాళ్లెవరికీ ఇటువంటి బ్రహ్మాండమైన అయిడియా తట్టివుండదనీ, నా ఒక్కడికే తట్టిందనీ, కాబట్టి తప్పకుండా నాకా ఉద్యోగం వచ్చేస్తుందనీ అనుకున్నాను." అని ఆగాడు శ్యామలరావు.

"కొంపతీసి, జీడిపప్పంతా తినేసి 'రికమెండు' చెయ్యడం మానేసిందా, ఏమిటి ?" అని అడిగాడు కైలాసరావు.

"అబ్బే ! పాపం ఆవిడలో ఏమేమీ లేదు. జీడిపప్పు తింటున్నప్పుడల్లా నాగురించి పొగిడి చెప్పిందట, బట్లరు ద్వారా తరువాత తెలిసింది. "పాపం ఆ నొక్కు నొక్కుల జుట్టూ, అందమైన మొహమూ, ఆ మొహంలో చిరునవ్వుతో ఆ అబ్బాయిని చూస్తుంటే జాలేస్తోందండీ. ఆ ఉద్యోగం అతని కిద్దురూ' అని గోముగా, ప్రేమగా, అనడం బట్లరు విన్నాడట. 'అలా అనడమే మీ కొంప ముంచింది సార్ !' అన్నాడు బట్లరు. ఎందుచేత ? అని అడిగాను. వాడు నన్ను సిగరెట్టంటే ఇమ్మన్నాడు. గోల్డుఫ్లేకు సిగరెట్టు ఒకటి వాడి మొహాన్న పారేశాను. అది కాలుస్తూ 'మా అయ్యగారు, నొక్కు నొక్కుల జుట్టా !' (అంటూ తమ బట్టతల తడుముకొన్నారు లెండి), అందమైన మొహమా ? (అద్దంలో ఒకసారి తమ మొహం చూసుకున్నారు), ఆమొహంలో చిరునవ్వా ! — హుం ! అని నౌకర్ని పిలిచి, 'రౌడీకుర్రాళ్ళ నెవ్వర్నీ బంగళా లోపలికి రానివ్వద్దంటే ఎందుకు రానిచ్చావు ? అని కేకలేశారండి" అని చెప్పాడు. ఆ తరువాత వాడిద్వారానే, ఆ ఆఫీసరుగారికి, వయస్సులో తమకన్నా చిన్నదైన

భార్యమీద చాలా అనుమానం అనీ, తన భార్య ఏ యువకుడినైనా మెచ్చుకుందంటే ఆ యువకుడిమీద ఈర్ష్యకొద్దీ తప్పకుండా ఆ యువకుడి కేదైన అపకారం తలపెట్టారనీ, ఆవిడ రికమెండు చెయ్యకపోతే నాకేమైనా లాభించి ఉండేదట కానీ, ఆవిడ రికమెండు చెయ్యడంవల్ల ఎంత మాత్రమూ ఆ ఉద్యోగానికి నేను 'సెలక్టు' అయ్యే అవకాశం లేదనీ, తెలుసుకున్నాను. కాబట్టి ఆడ మధ్యవర్తులు మరీ ప్రమాదకరం."

"ఈ రెండూ రకాల ప్రయత్నాలు 'ఫే' లయితే, తిన్నగా అసలు అధికారిని కలుసుకోవడమే మంచిదిరా" అన్నాడు కైలాసరావు దీర్ఘంగా ఆలోచిస్తూ.

"ఒక ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ ఆపనీ చేశాను మామయ్యా! ఆయన వెంటనే, అప్లికేషనుఫారములో ఉన్న ఏవిధమైన ఒత్తిడినైనా తెచ్చి, సెలక్టుచేసే అధికారులను వశపర్చుకొనుటకు ప్రయత్నించువారి ఉద్యోగార్హతను పోగొట్టుకొందురు' అన్న 'క్లాజు' చూపించి నా కళ్ళ ఎదుటే నా అప్లికేషన్ ఫారం తెప్పించి, నేనా ఉద్యోగానికి అనర్హుణ్ణి అని రాశేశాడు" అని శ్యామలరావు దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు.

కైలాసరావు కొత్త సిగరెట్టు వెలిగించాడు. మేనల్లుడు ఉద్యోగరంగంలో ఇన్ని పరాజయాలు పొందాడని తెలుసుకొన్న తరువాత, ఆయన తను ఎటువంటి సలహా నిస్తే అది శ్యామలరావుకి పనికివస్తుందా? అని రెండు నిమిషాలు ఆలోచించక తప్పలేదు. ఆ రెండు నిమిషాలూ శ్యామలరావు ఆతృతగా మేనమామ మొహంకేసి చూశాడు.

"ఈసారి ఎటువంటి ప్రయత్నం చెయ్యాలా అని తెగ ఆలోచిస్తున్నాను మామయ్యా. ఎందుకంటే ప్రస్తుతం నేను ఇంటర్వ్యూకి వెళ్తున్న ఉద్యోగం చాలా మంచిది. ఆ ఉద్యోగానికి అభ్యర్థుల నెన్నుకొనేది — 'సర్వీసు కమీషన్ లాంటి బోర్డు. వాళ్ళ రికమెండు చేసి పంపినవాళ్ళకి దేశవ్యాప్తంగా ఉన్న — వాళ్ళ కంపెనీలలో — ఎక్కడైనా పెద్ద ఉద్యోగం ఇస్తారు, ఈ కంపెనీ వాళ్ళు. ఆ బోర్డులో, ఆ కంపెనీ జనరల్ మేనేజరుతో సహా ముగ్గురు సభ్యు లుంటారు. అందులో ఏ ఒకడికైనా ఒక చిన్న రికమెండేషను తీసుకువెళ్తే బాగుండును" అన్నాడు శ్యామలరావు.

"సరే ప్రయత్నిద్దాం. ముందు నువ్వు ఇంటర్వ్యూకి బయల్దేరు" అన్నాడు కైలాసరావు. అతని మాటలపై నమ్మకంతో శ్యామలరావు, కైలాసరావుకి మద్రాసులో తెలిసిన పెద్దవాళ్ళెవరైనా ఉన్నారేమో, వాళ్ళకి ఏదైనా రికమేండేషను లెట రిస్తాడేమో అనుకున్నాడు. మామయ్య తల్చుకుంటే ఎటువంటి పనైనా చెయ్యగలడనే నమ్మకం శ్యామలరావుకి ఉంది.

మర్నాడు ప్రొద్దున్న మెద్రాసు మెయిలుకి బయలుదేరినశ్యామలరావుతో బాటు, కైలాసరావు కూడా, నెల్లూరులో తనకొక పని ఉందనీ, అందుకొరకు తను నెల్లూరు వరకూ ప్రయాణం చెయ్యదల్చుకున్నాననీ చెప్పి బయల్దేరాడు. మామా, అల్లుళ్ళిద్దరూ మెయిల్లో సెకండు క్లాసు కంపార్టుమెంటు ఎక్కారు.

రాజమండ్రినుంచి బెజవాడ వెళ్ళేదాకా కైలాసరావు ఏదో డిటెక్టివ్ పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు. రాత్రి అవడంవల్ల, శ్యామలరావు రైలు కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ తన భవిష్యత్తును ఆ అంధకారంతో పోల్చుకున్నాడు. తను కాలేజీలో బి. ఎ. పాసవగానే, పెద్ద ఉద్యోగమేదో తనకోసం సిద్ధంగా ఉంటుందనీ, అది అంగీకరించి, నెలనెలా జీతం పుచ్చుకోవడమే, తను చెయ్యవలసిన పని అనుకున్నాడు. అతన్ని ఒక ధనవంతురాలైన విధవ పెంచుకొంది. ఆమె ఆస్తిమీద వచ్చే ఆదాయం అన్నోదకాలకు సరిపోతుంది కాని, తను ఉద్యోగమేదైనా సంపాదించేవరకూ వివాహం చేసుకోవడానికి వీలులేదని, తన కాబోయే మామగారు ఒక షరతుపెట్టాడు. ఆయన కూతుర్ని నిలువునా ప్రేమించెయ్యడంవల్ల, శ్యామలరావు త్వరలోనే ఉద్యోగం సంపాదిస్తానని శపథం పట్టాడు. ఇప్పుడు శ్యామలరావుకి ఉద్యోగం దొరికేదాకా, హృదయం భగభగ మండిపోతోంది. ఆ మంట చల్లారాలంటే, ప్రేమసఫల మవ్వాలి. ప్రేమ సఫల మవ్వాలంటే ఉద్యోగం దొరకాలి — అంటే ఆ అంధకారంలో వెలుగు కన్పించాలి..... అలా — అలా — ఆలోచిస్తున్న శ్యామలరావుకి ఆ అంధకారంలో చాలా వెలుగులు ఒక్కసారి కల్పించాయి. అవి బెజవాడ స్టేషను లైట్లు!

బెజవాడ స్టేషనులో, వీళ్ళ కంపార్టుమెంటులోకి నలుగు రైదుగురు ఎక్కారు. శ్యామలరావు ప్లాటుఫారం మీదకి దిగి మెయిలు, ఈ చివరనుంచి ఆ చివరదాకా నాలుగుసార్లు పచార్లు చేశాడు. అన్ని కంపార్టుమెంటులలోనూ ఉన్న రకరకాల అమ్మాయిల్ని చూపుల్తో పరామర్శ చేశాడు.

మనస్సు పూరికే బాధపడిపోతున్నప్పుడు, కాస్త అందమైన అమ్మాయి ఎవరైనా, నాలుగుసార్లు తనవేపు చూస్తే శ్యామలరావు కది, స్ట్రాంగ్ కాఫీలా పనిచేస్తుంది. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో, ద్వారంవద్ద నిల్చున్న ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తనవైపు తదేక దీక్షగా చూడడం గమనించాడు శ్యామలరావు. ఒకసారి తన నొక్కునొక్కుల జుట్టు చెదరిపోకుండా ఉందా లేదా — అని అనుమానం వేసి చేత్తో జుట్టు తడుముకున్నాడు. ఆ అమ్మాయికి బాగా స్పష్టంగా కన్పించేట్టు, దగ్గరలో ఉన్న ఎలక్ట్రిక్ లైటుకి మరింత దగ్గరగా జరిగాడు. మధ్య మధ్య స్టేషన్‌వైపు చూస్తున్నా, విధిగా ఆ అమ్మాయి మళ్ళీ శ్యామలరావు వేపు చూస్తోంది. ఆ చూపులుచూస్తుంటే శ్యామలరావుకి 'మనవులుగా అమాయక చూపుల మనసును లాగిన దెవరో ?' అన్న పాట జ్ఞాపక మొచ్చింది. తనలో తను చిన్నచిరునవ్వు నవ్వుకున్నాడు. ఇంతలో రైలు కూసింది. ఆ అమ్మాయికి చూపుల్తోనే 'టా! టా!' చెప్పి, పరుగెత్తి వెళ్ళి తన కంపార్టుమెంటులో పడ్డాడు. రైలు కదిలిపోతున్నా, శ్యామలరావు మనస్సులోంచి ఆ అమ్మాయి రూపం కదల్లేదు. ఈ ఇంటర్వ్యూ వచ్చిపడింది. లేకపోతే, టికెట్టు మార్పించేసి తనూ ఫస్టు క్లాసులోనే ఎక్కేసేవాడు. అంటే ....


నెర్విటాల్

నరముల బలహీనతకునూ, రక్తపోటుకునూ, రామ బాణము. అనుభవయుక్తముగా చేయబడినది.

8 ఔ. సీసా 5–75, పోస్టేజి 1–75.

ఇండియన్ మెడిసన్ హౌస్,

విజయవాడ-2.

క్రమంతప్పక వాడండి

నీమ్

టూత్‌పేస్ట్

ఆధునిక టూత్ పేస్టులో వాడబడు అవసరమైన ఔషధము లన్నింటితో కలసి, వేపలోని శక్తివంతమైన భాగములన్నియు పొందియున్న ఒకే ఒక టూత్ పేస్ట్




కలకత్తా కెమికల్ కలకత్తా-29

NTP-192-TE

దక్షిణ ఇండియా ఆఫీసు 5/149, బ్రాడ్వే, మద్రాసు-1.




# తెరవెనుక

మరెందుకూ కాదు, వూరికే 'కంపెనీ' కోసం. ఆ అమ్మాయి చాలా సరదా మనిషిలాగుంది ఆ యింటర్వ్యూ బోర్డులో ఇలాటి అమ్మాయి లున్నా బాగుండును! తను గ్యారంటీగా సెలక్టయ్యేవాడు!

"వీడు మా మేనల్లుడు. బి. ఏ. పాసయి రెండేళ్ల నుంచీ చచ్చీ చెడీ తిరుగుతున్నాడు — ఉద్యోగం కోసం. అబ్బే! ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఒక్కటీ కలిసి రాలేదు. ఇంతకీ అదృష్టం కలిసిరావాలి" అన్న కైలాసరావు మాటలు విని ఈ లోకంలో పడ్డాడు —, శ్యామలరావు.

ఆ మాటలు ఎవరి నుద్దేశించి కైలాసరావు అన్నాడో, ఆ వ్యక్తికి సుమారు అరవై ఏళ్లుంటాయి. చాలా దర్జాగా, ట్వీడ్ సూటు వేసుకొని, పైపు కాలుస్తూ మాట్లాడుతున్నాడు. తెల్లని శరీరచ్ఛాయ ఆయనది. ఆయన బెజవాడలో ఎక్కి ఉండవచ్చు. కైలాసరావుకీ ఆయనకీ సంభాషణ ప్రారంభమై అరగంటయింది. అసలు వాళ్ల సంభాషణ ప్రారంభమై అరగం టయింది. అసలు వాళ్ల సంభాషణ, కైలాసరావు చదువుకున్న మర్డర్ ఈజెనైన్ జాబ్' అనే డిటెక్టివ్ పుస్తకం మీద ప్రారంభమైంది. వయస్సులో ఇద్దరూ పెద్దవాళ్లయినా, డిటెక్టివ్ పుస్తకాల మీద వాళ్లకున్న సరదా, కుర్రవాళ్లను మించిపోయింది. ఆ పరస్పర ఏకీభావంవల్ల వాళ్లిద్దరూ చాలా స్నేహితులై పోయారు. ఆ కొద్ది సేపటిలోనే! అసలు కైలాసరావుకి ఎవరితోనైనా ఇట్టే స్నేహం చెయ్యగల చాకచక్యం ఉంది. వాళ్ల సంభాషణ ఉద్యోగాల మీదకు మళ్లింది.

"అదృష్టమూ కలిసిరావాలి. మనుష్య ప్రయత్నం కూడా వుండాలి." అన్నాడా వ్యక్తి.

"ఏ మనుష్యప్రయత్నం లెద్దురూ. ఎంత కష్టపడి చదువుకు వెళ్లినా, ఆ ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లు వీళ్లని ఇట్టే బోల్తా కొట్టించేస్తారు. అదే ఒక చిన్న రికమెండేషనుతో వెళ్తే, సులభమైన ప్రశ్న లడిగి, ఇట్టే సెలక్టు చేసేస్తారు."

"నిజమే మామయ్యా. ఒక ఇంటర్వ్యూలో నన్ను 'ఫామిలీ ప్లానింగు' గురించి బోలెడు ప్రశ్నలు వేశారు. నేను బ్రహ్మచారిని. నాకా విషయాలేమీ తెలియవంటే, ఈ రోజుల్లో బ్రహ్మచారులకే ఈ విషయాలు బాగా తెలుసు, నువ్వు వట్టి చాతకానివాడవు. ఈ ఉద్యోగానికి పనికిరావు పొమ్మన్నారు. నా తరువాత వెళ్లిన వాణ్ణి — ఇంగ్లీషు భాషకు ఎన్ని అక్కరాలని అడిగితే, వాడు 'ముప్పైరెండు!' అని జవాబివ్వగానే వాణ్ణి 'నువ్వు జీనియస్‌వి. నీకు వెంటనే ఉద్యోగం ఇస్తున్నా' మన్నారు. తరువాత తెలిసింది. అతనికి పెద్ద రికమెండేషను ఉందని" అన్నాడు శ్యామలరావు.

అతని మాటలకు, పెద్దవాళ్లిద్దరూ నవ్వారు. కొత్త వ్యక్తి పైపు కాలుస్తూ కొద్దిసేపు మవునంగా ఉన్నాడు. కైలాసరావు, ఇంటర్వ్యూల గురించీ, రికమెండేషన్లగురించీ ఉపన్యాస మిచ్చేస్తున్నాడు. అది వింటూ ఆలోచిస్తున్న కొత్త వ్యక్తి, తన జీవితంలోనే జరిగిన ఒక విచిత్ర సంఘటనగురించి చెప్తానని, ప్రారంభించారు.

"నేను జి. టి. సి. కంపెనీలో డిప్యూటీ జనరల్‌మేనేజరుగా పనిచేసి రిటైరయ్యాను. మీకు తెలిసే ఉంటుంది. జి. టి. సి. కంపెనీకి పదహారు సిగరెట్ ఫ్యాక్టరీ లున్నాయని. హిందువుల కిచ్చే పెద్దపోస్టు నాదే. దీని తరువాత జనరల్ మేనేజరు పోస్టే పెద్దది. అది ఎప్పుడూ దొరల చేతుల్లోనే ఉంటుంది. ఇరవై ఏళ్ల క్రిందట, ఈ కంపెనీ ఇంత పెద్దది కాదు. కానీ, ఈ కంపెనీలో ఉద్యోగమంటే ఎంతో గౌరవ ముండేది, అందరికీ. ఆ రోజుల్లో, ఈ కంపెనీ కొంతమంది 'ఎగ్జిక్యూటివ్‌సు' కోసం దరఖాస్తుల్ని కోరింది. సుమారు ఏభైమంది బాగా చదువుకున్నవాళ్ళు దరఖాస్తులు పడేశారు." అని ఆగారు.

కైలాసరావు, "నిజమే జి. టి. సీ, కంపెనీలో ఉద్యోగమంటే మాటలుకాదు. అప్పటికీ, ఇప్పటికీకూడా ఆ కంపెనీ ఉద్యోగమంటే అందరికీ గౌరవమే. పెద్ద జీతం, మంచి ఇల్లూ, కారూ, నౌకరూ, అన్నీ ఇస్తారు. ఎక్కడికి వెళ్లినా ఫస్టుక్లాసు ట్రావెలింగు." అని తలూచాడు.

కొత్తవ్యక్తి మళ్లీ ప్రారంభించాడు. "దరఖాస్తులు పెట్టిన ఏభైమందిలో నే నొకణ్ణి. ఇంటర్వ్యూలో, వాళ్ళు ముగ్గుర్ని సెలక్టుచేసి, వారిపేర్లు అతిరహస్యంగా ఉంచారు. అప్పటి జనరల్‌మేనేజరు, తన 'స్టెనో' ని పిల్చి ఈ మూడు పేర్లూ చెప్పి, (మరునాడు ఇంగ్లండు వెళ్లిపోయాడు) తను ఇంగ్లాండు వెళ్లాక, ఆముగ్గురిపేర్లూ బయటపెట్టమని చెప్పాడు. అంటే సుమారు నెల రోజుల దాకా ఇంటర్వ్యూ ఫలితమేమైనదీ, ఎవరికీ తెలియదు. ఒక్క స్టెనోకి తప్ప! అంతవరకూ ఈ ఏభయిమందీ తమకి ఆర్డరు వస్తుందని ఎదురుచూస్తూనే ఉన్నారు. నాకుమాత్రం ఇంటర్వ్యూలో సెలక్టవుతానని ధైర్యం లేదు. అందుకని, రోజూ ప్రొద్దున్న సాయంకాలం ఆ స్టెనోచుట్టూ తిరిగి అతన్ని, ఏం జరిగిందో చెప్పమని ప్రాధేయపడుతూండేవాణ్ణి. అతను రోజూ, తనకేమీ తెలియదని అంటున్నా అతన్ని వదలిపెట్టేవాణ్ణి కాదు. చివరికి, ఇక రెండురోజులలో ఆర్డర్సు పంపుతారనగా, ఒకనాటిరాత్రి అతను నాతో, నేను సెలక్టుకాలేదనీ, నా పేరుగల మరొకతను సెలక్టయ్యాడనీ చెప్పి, ఆ విషయం రహస్యంగా ఉంచమని చెప్పాడు."

"ఆ! ఏమిటీ?" అంటూ శ్యామలరావూ, కైలాసరావూ ఇద్దరూ తెల్లబోయారు.

"అవును. నా పేరు ఆర్. కైలాసనాథ్! సెలక్టయిన వ్యక్తిపేరు కె. కైలాసనాథ్! ఆయన ఆవిషయం చెప్పగానే నాకు చాలా దుఃఖం వచ్చింది. నే నప్పుడు చాలా చికాకుల్లో ఉన్నాను. నా తండ్రి చనిపోయాడు. నలుగురు తమ్ముళ్లూ, ముగ్గురు చెల్లెళ్లూ, తల్లీ, నా సంపాదనమీద బ్రతకాలి. ఒక చిన్న యిల్లు ఉండేదికాని, అప్పటికి, మేం చేసిన అప్పులు తీర్చెయ్యడానికి ఆయిల్లు అమ్మేశాం, అంతకు నాల్గు రోజుల

క్రితమే. నేను ఆయనమాటలు విని ఆయన ముందరే ఏడ్చేశాను. ఆయనకు నామీద చాలా జాలికలిగింది. పైగా ఈనెల రోజుల్నుంచీ ఆయనచుట్టూ తిరగడంవల్ల మా యిద్దరి మధ్యా కొంత చనువు ఏర్పడింది. తనవల్ల నేమైనా సాయం కావాలంటే తను సిద్ధంగా ఉన్నాననీ, కానీ తను చేసేదేమీ లేదనీ అన్నాడు. మళ్లీ నేను ఎంతో బాధపడడంచూసి, ఆయనే, 'కె. కైలాస నాథ్' లో 'కె' ని 'ఆర్' క్రింద దిద్దవచ్చునుగాని, ఆ కాగితాలు మరి ఇద్దరు గుమస్తాల చేతుల్లోంచి వెళ్తాయికాబట్టి వా ళ్లనుమానపడవచ్చు నన్నాడు. ఆయన అలా అనగానే నాకు కొంత ధైర్యం వచ్చింది. నేను ఆయనను నా దగ్గర కొద్దిగా డబ్బు ఉందనీ, అది ఆ గుమాస్తాలకు ఇచ్చి పని జరిపించమనీ ప్రార్థించాను. ఆయన కొద్దిసేపు ఆలోచించి సరేనన్నాడు. వెంటనే ఇంటికి పరుగెత్తుకు వెళ్లి, మా యిల్లు అమ్మిన తాలూకు మూడువందల రూపాయ లుంటే, తీసికెళ్లి ఆయన కిచ్చాను. మూడోరోజున నా చేతికి ఆర్డ రొచ్చింది" అన్నాడు.

"అది విని, "అబ్బ ! భలేపని చేశారు !" అన్నాడు శ్యామలరావు. కైలాసరావుమట్టుకు, ఎక్కడో శూన్యంలో చూస్తున్నట్టు చూస్తూ, విచారంగా మొహంపెట్టాడు. ఆ కొత్త వ్యక్తి, కైలాసరావు అలా ఉండడం చూసి, "నే చేసినది తప్పంటారా ?" అని అడిగాడు.

"అబ్బే ! అది నా దురదృష్టం !" అన్నాడు కైలాసరావు దీనంగా.

ఎప్పుడూ హుషారుగా ఉండే, తన మేనమామ మొహం ఇంత దీనంగా వుండేమా ! అని ఆశ్చర్య పడ్డాడు. శ్యామలరావు. కొత్తవ్యక్తి కూడా కైలాసరావువైపు వింతగా చూశాడు.

కైలాసరావు, ఆ కొత్త వ్యక్తితో "మీ రెప్పుడైనా, మీకోసం బలికాబడిన కె. కైలాసనాథ్ ని కలుసుకున్నారా ?" అన్నాడు.

"లేదు."

"అయితే ఇప్పుడు కలుసుకుంటున్నారు. నేనే ఆ కె. కైలాసనాథ్ ని" అన్నాడు కైలాసరావు. అది విని ఆ కొత్తవ్యక్తి నీరుకారిపోయి "క్షమించండి. అప్పట్లో నా పరిస్థితి .... " అంటూంటే, కైలాసరావు "మీరు బాధపడ నక్కరలేదు. నా దురదృష్టంవల్ల నా కది రాలేదు. ఒక్క జి. టి. సి. కంపెనీయేకాదు, అనేక చోట్ల ప్రయత్నంచేశాను. ఏదీ కలిసిరాలేదు. చివరికి ఈ ప్లీడరీవృత్తిలో కాలక్షేపం చేస్తున్నాను. ఇందులోకూడా నే నంత పైకి రాలేక పోయానంటే కారణం నా దురదృష్టమే" అన్నాడు.

శ్యామలరావు, "మామయ్యా, నీపేరు కైలాస రావుకదా ?" అని తన సందేహం బయట పెట్టాడు. కొత్తవ్యక్తి కూడా, వింతగా కైలాస రావువేపు చూశాడు.

"అవును. అనేక ఉద్యోగ ప్రయత్నాలు విఫలమయ్యాక నాకు, నా జాతకంలోనే ఏదో లోప ముందనే అనుమానం కొద్దీ ఒక జ్యోతిష్కుడికి నా జాతకం చూపించాను. అతను, నాకు కైలాస నాథ్ అనే పేరు అచ్చిరాదనీ, 'కైలాసరావు' అని మార్చుకోమని సలహా యిచ్చాడు. అప్పటినుంచీ కైలాసరావు నయ్యాను" అన్నాడు కైలాసరావు అల్లుడివైపు చూస్తూ, విచారంగా.

శ్యామలరావూ, కొత్త వ్యక్తి కూడా తృప్తి పడ్డారు.

కొత్త వ్యక్తి, కైలాసరావుని చాలాసార్లు క్షమాపణ కోరుకొన్నాడు. మాటలసందర్భంలో కైలాసరావు తన మేనల్లుడైన శ్యామలరావు మద్రాసుకు ఉద్యోగానికై వెళ్తున్నాడనీ, అతని ప్రయత్నమైనా సఫలమైతే బాగుండుననీ అన్నాడు. కొత్తవ్యక్తి, శ్యామలరావుని, అతను వెళ్లబోయే ఇంటర్వ్యూ గురించి అనేక ప్రశ్న లడిగాడు. శ్యామలరావు, బి. ఎం. ఎస్. అనే ఒక పెద్ద కంపెనీలో సేల్సుమాన్ ఉద్యోగానికై వెళ్తున్నాడు.

"మీ కభ్యంతరం లేకపోతే, జి. టి. సి. కంపెనీలో నాకున్న పలుకుబడిని వినియోగించి మీ మేనల్లుడికి ఒక మంచి ఉద్యోగం వేయించాలని ఉంది. తద్వారా, నావల్ల మీకు జరిగిన అన్యాయానికి కొంత ప్రతికృతి చేసినట్లు భావిస్తాను" అన్నాడు ఆ కొత్త వ్యక్తి. అందుకు శ్యామలరావూ, కైలాసరావూకూడా అంగీకరించారు. శ్యామలరావుని, ఆ కొత్తవ్యక్తికి అప్పగించి, కైలాసరావు నెల్లూరులో దిగిపోయాడు. ఆ వ్యక్తి తను కూడా మద్రాసే వెళ్తూండడంవల్ల, శ్యామలరావుకి, మద్రాసు వెళ్లిన వెంటనే ఉద్యోగ మిప్పిస్తానని కైలాసరావుకి హామీ ఇచ్చాడు.

శ్యామలరావు, మద్రాసు చేరిన దగ్గర్నుంచీ, ఏమీ శ్రమపడనక్కరలేకుండా అన్ని పనులూ చకచకా జరిగిపో నారంభించాయి. కైలాసనాథ్ గారు, శ్యామలరావుని తిన్నగా జి. టి. సి. కంపెనీ జనరల్ మానేజరువద్దకు తీసికెళ్లి పరిచయం చేసి, తనకు చాలా కావలసిన యువకుడనీ, మంచి ఉద్యోగ మిప్పించమనీ, సిఫార్సు చేశాడు. శ్యామలరావుకి ప్రత్యేకంగా ఒక చిన్న ఇంటర్వ్యూ ఏర్పాటయింది. వారంరోజులలో, మెడికల్ ఎగ్జామినేషన్ వగైరా పూర్తిచేసి, ఆర్డరు కొద్దిరోజులలో పంపిస్తామని చెప్పారు కంపెనీవారు. పది రోజుల తరువాత 'జూనియర్ ఎక్జిక్యూటివ్' ఆర్డరు పట్టుకొని, రాజమండ్రిలో దిగి శ్యామలరావు, మేనమామతో జరిగినదంతా చెప్పాడు. కైలాసరావు చాలా సంతోషించాడు.

"కాని మామయ్యా ! నువ్వు జి. టి. సి. కంపెనీకి ఇరవైఏళ్ల క్రిందట ప్రయత్నించడం, నీకు రాకుండా నీ పేరుగల మరొకడికి ఉద్యోగం రావడం మొదలైన విషయాలు నాకు తెలియవు సుమా !" అన్నాడు శ్యామలరావు.

"నాకుకూడా తెలియదురా. ఆయన తను చేసిన గొప్పపనిని బయటపెట్టాక, ఆయన్నొక చిన్న ఆట ఆడిద్దామని సరదావేసింది. మధ్యలో నువ్వు వేసిన అడ్డు ప్రశ్నతో, దానికి మరింత రంగుపులమాలిసి వచ్చింది. చివరకు ..." అని కైలాసరావు అంటూంటే, శ్యామలరావు

"వ్హాట్! అదంతా నటనే నన్నమాట. బలేగా ఉంది మామయ్యా ! బలే ! బలే !" అంటూ పొట్ట ఉబ్బేటట్లు నవ్వ నారంభించాడు.

"కానీ ఒకందుకు అది బాగా కలిసివచ్చింది" అన్నాడు కైలాసరావు. శ్యామలరావు అవునన్నాడు. తన ఉద్యోగానికి మంచి రికమండేషను సంపాదించి పెట్టిందని ఒప్పుకున్నాడు.

"మొత్తానికి ఉద్యోగం సంపాదించాలంటే, నువ్వన్నట్లు, తెరవెనుక ప్రయత్నమే ముఖ్యం" మామయ్యా అన్నాడు శ్యామలరావు.

"ఉద్యోగం దొరికింతరువాత కూడా, తెర వెనుకే ఉండిపోయి, తెరమీదకు రావడం మర్చిపోకు సుమా !" అన్నాడు కైలాసరావు నవ్వుతూ.

★



విరిగిన అరడజను సూదులతో కలిపి మీ మొత్తం బిల్లు తీసుకోండి.